ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 30 సెప్టెంబరు 2025

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు : జేసీ


అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంలో సమర్పించే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ లోని సభాభవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదు దారుల సమస్యలపై పారదర్శకంగా విచారణ చేసి, నాణ్యమైన పరిష్కారాలు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. అర్జీలు పెండింగ్‌లేలేకుండా, రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఓబులమ్మ, ఎస్డీసీ వెంకటపతి, డీఆర్డీయే పీడీ రాజ్యలక్ష్మి, జిల్లా పర్యాటక శాఖాధికారి సురేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ సేవింగ్స్‌పై అవగాహన

సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ పన్నుల తగ్గింపుపై ప్రజల్లో అవగాహన కల్పించేలా అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో జీఎస్టీ తగ్గుదలతో ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరల తగ్గింపుపై కమర్షియల్ ట్యాక్స్ ఆధ్వర్యంలో అర్జీదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

బాధితులకు సత్వర న్యాయం చేయండి

- ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ


బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీసుస్టేషన్లకు వచ్చేవారి సమస్యలు తెలుసుకుని వాటిని సత్వరం పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మొత్తం 149 ఫిర్యాదులు పీజీఆర్ఎస్‌కు వచ్చాయి. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజల ఫిర్యాదులను పరిశీలించి సంబంధిత పోలీసు అధికారులతో వెంటనే ఫోనులో మాట్లాడారు. చట్టపరమైన పరిమితుల్లో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా.. పీజీఆర్ఎస్‌కు వచ్చిన వృద్ధులు, దివ్యాంగుల వద్దకే ఎస్పీ వెళ్లి వారి ఫిర్యాదులను స్వీకరించారు. న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో దోపిడీపై విచారణ కమిటీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ప్రొద్దుటూరు సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సాగుతున్న దోపిడీపై సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చింది. దీనిపై స్పందించిన డీసీహెచ్ఎస్ అధికారిని హిమదేవి ముగ్గురు వైద్యాధికారులను విచారణకు నియమించింది. ఇందులో జమ్మలమడుగు నుంచి డాక్టర్ చంద్రకళ, డాక్టర్ సునీల్ కడప డీసీహెచ్ఎస్ కార్యాలయం నుంచి చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ మమతను నియమించారు. వీరు ఐపీహెచ్ఎల్ ల్యాబ్‌లో అక్రమాలకు పాల్పడుతున్న ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కోరింది. ప్రైవేటు ల్యాబ్ పెట్టుకుని అక్కడికి బ్లడ్ శాంపిల్స్ తరలిస్తూ వసూళ్లకు పాల్పడుతుండటం, ప్రభుత్వ ఆసుపత్రిలోని ఫార్మసీ కి వచ్చిన ల్యాబ్ పరికరాలను చోరీ చేయడంపై విచారించనున్నారు. ఈ అక్రమాలపై కొందరు వ్యక్తులు సైతం డీసీహెచ్ఎస్ అధికారికి ఫిర్యాదు చేశారు.

హామీలను విస్మరిస్తున్న కూటమి - తులసి రెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందని కరెంటు చార్జీలు, జీఎస్టీ విషయంలో ఇటు కూటమి, అటు కేంద్ర ప్రభుత్వాలు ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరెంటు చార్జీలు పెంచమన్నారని, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2017 నుంచి 2025 వరకు ఎనిమిదేళ్ల పెద్దఎత్తున జీఎస్టీ విధించిందని, ఇప్పుడు రెండు స్లాబులు చేసి 345 వస్తువులపై ధరలు తగ్గుతాయి పండుగ చేసుకోండి అని ప్రజలకు చెప్పారని, కానీ క్షేత్రస్థాయిలో చాలామటుకు జీఎస్టీ తగ్గలేదని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు ఏమాత్రం తగ్గించలేదని, దుకాణదారులు బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని వివరించారు.. పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చి కేంద్రం చిత్తశుద్ధిని చాటుకోవాలని ఆయన హితవు చెప్పారు.

వంకనూ వదల్లేదు


రామాంజనేయపురంలోవర్షం నీరు వెళ్లే వంకను ఆక్రమించి సాగుతున్న నిర్మాణాలు



- తాజాగా రూ.2 కోట్ల విలువ చేసే వంక కబ్జా
- వర్షం వస్తే నీరు పోయేదారి బంద్
- ఆందోళన చెందుతున్న యానాదికాలనీ వాసులు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప నగరం నాలుగేళ్ల క్రితం భారీ వర్షాల ధాటికి చిగురుటాకులా వణికిపోయింది. కాల్వలు, వాగులు, వంకలు ఆక్రమించడంతో వర్షం నీరంతా ఇళ్లల్లోకి చేరింది. దీంతో జనం తీవ్ర అవస్థలు పడ్డారు. అప్పట్లో ప్రత్యేక చర్యలు చేపట్టి కడప నగరంలో ఆక్రమణలు కొంతమేర తొలగించారు. ఇప్పుడు హైదరాబాదు భారీ వర్షాలతో ముంపునకు గురైంది. అక్కడ కాల్వలు ఆక్రమణకు గురికావడంతో నీరు పోయేందుకు దారిలేక నీట మునిగింది. ఈ సంఘటనలు కళ్లముందే కనిపిస్తున్నా కొందరిలో మార్పు రావడంలేదు. నివాస స్థలాలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా వాగులు వంకలు డ్రైనేజీలు ఆక్రమించేసుకుంటున్నారు. ఇది వర్షాకాలంలో తీవ్ర ముంపునకు దారి తీసే ప్రమాదం ఉంది. అయినప్పటికీ లెక్క చేయకుండా వంకలు కబ్జా చేసేస్తున్నారు. తాజాగా కడప నగరంలోని రామాంజనేయపురంలో పాత పీఎఫ్ క్వార్టర్స్ ఎదురుగా వంకను ఆక్రమించేసి బేస్‌మట్టం వేశారు. మరకొరు ప్రహరీగోడ కట్టేశారు.

వర్షం వస్తే మునకే

ఇప్పుడు వర్షాకాలం. అక్టోబరులో తుఫానులు వస్తాయి. వరుసగా మూడురోజుల పాటు వర్షం కురిస్తే వాగులు వంకలు కుంటలు కాల్వలు పొంగి పొర్లుతాయి. ఇప్పుడు ఇక్కడ కాల్వ ఆక్రమించడంతో నీరుపోయే దారే లేదు. రేపు వర్షం వస్తే ఆ నీరంతా పోయేందుకు వీలు లేక పక్కన ఉన్న యానాదికాలనీలోని ఇళ్లల్లోకి చేరుతుంది. ఇక్కడ సుమారు వంద కుటుంబాలకు పైగా పేదలు నివాసం ఉంటున్నారు. వంక ఆక్రమించడంతో వర్షాకాలంలో నీరు ఇళ్లల్లోకి వస్తుందని యానాదికాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఈ ప్రాంతంలో ఆక్రమణలపై చర్యలు చేపట్టారు. ఈ వంకను ఎక్స్‌కవేటర్‌తో తవ్వి వెడల్పు చేశారు. ఇలాంటి వంకను పూడ్చేసి పట్టపగలే దర్జాగా ఆక్రమించేస్తున్నా.. అధికార యంత్రాంగం పట్టించుకోక పోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఆక్రమించేశారు



కడప-రాజంపేట ప్రధాన రహదారిలోని రామాంజనేయపురంలో శ్రీనివాస గార్డెన్‌కు ఎదురుగా జర్నలిస్టు కాలనీ, వరద కాలనీలకు వెళ్లే దారి ఉంది. ఈ దారి పక్కనే యానాది కాలనీ ఉంది. ఈ కాలనీ మధ్యలో వంక ఉంది. వర్షాకాలంలో పై ప్రాంతం నుంచి వచ్చే నీరు ఈ వంక ద్వారా ప్రవహిస్తుంది. ఇటీవల ఈ ప్రాంతం విస్తరించి అభివృద్ధి చెందుతోంది. ఇక్కడే వైసీపీ జిల్లా ప్రధాన కార్యాలయంతో పాటు వెంచర్లు, కల్యాణ మండపాలు, పెద్దఎత్తున గృహాలు వెలుస్తున్నాయి. సెంటు ఇక్కడ ఎంత తక్కువ వేసుకున్నా కనీసం రూ.10లక్షలు పైమాటే. ప్రధాన రహదారికి దగ్గరలో ఇంకా రేటు ఎక్కువ ఉంటుంది. అందుకే ఈ ప్రాంతంలో సెంటు స్థలం ఖాళీగా ఉన్నా ఆక్రమణకు గురవుతుంటుంది. ప్రధాన రోడ్డుకు పీఎఫ్ క్వార్టర్స్‌కు మధ్యలో వెళ్లే ఈ కాలువ సుమారు 20 అడుగుల వెడల్పు ఉంటుంది. ఇక్కడ సుమారు రూ.2కోట్ల విలువచేసే 20 సెంట్ల వంకను ఆక్రమించి బేస్‌మట్టం వేసి లెవల్ చేసేశారు.

టెయిలింగ్‌పాండ్ సమస్య తీరేనా..?

- గ్రామాల నుంచి ఎదురవుతున్న నిరసనలు
- సమస్య పరిష్కారంలో యూసీఐఎల్ తాత్సారం


వ్యర్థాలతో నిండిన యూసీ ఐఎల్ టెయిలింగ్ పాండ్

పులివెందుల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మొన్నటి వరకు టెయిలింగ్‌పాండ్‌తో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐఎల్) గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఇప్పుడు అదే సమస్య యూసీఐఎల్ మనుగడకు ముప్పుగా మారుతోంది. ఏళ్ల తరబడిగా నిరసనలు, ప్రతిఘటనలు ఎదురవుతున్నా లెక్కచేయని యూసీఐఎల్.. ఇప్పుడు టెయిలింగ్‌పాండ్ నిండడంతో దాని విస్తరణ తప్పకుండా చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. వివరాలిలా..

ఎం.తుమ్మలపల్లె వద్దనున్న యూసీఐఎల్‌ను అప్పటి ప్రభుత్వం 2007లో మొదలు పెట్టి 2009 నాటికి నిర్మాణ పనులు పూర్తిచేసి ముడి యురేనియం నుంచి యురేనియాన్ని శుద్ధిచేసేందుకు పనులు ప్రారంభించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ కర్మాగారం ఏదో ఒక సమస్యతో సాగుతోంది. ఇక్కడ శుద్ధికర్మాగారం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేశారు. అయినప్పటికీ దాదాపు మూడేళ్లపాటు ముడి యురేనియం శుద్ధిచేసే సమయంలో యురేనియం ఫిల్టర్ కాకుండా వ్యర్థాల్లోకి పోతూ వచ్చింది. దీనితో ఒకానొక సందర్భంలో కొన్నిరోజుల పాటు కర్మాగారాన్ని మూసేస్తారని అప్పట్లో యాజమాన్యమే ఉద్యోగులకు చెప్పింది. ఆ సందర్భంలో ఆర్డీఎస్ (రీ డిజల్యూషన్ సిస్టం) ఈ కర్మాగారంలో ప్రవేశపెట్టడంతో వ్యర్థాల్లోకి పోతున్న యురేనియం ఫిల్టర్ కావడంతో ఉత్పత్తి పెరిగింది. దీనితో కర్మాగారం యథావిధిగా నడుస్తూ వచ్చింది. 2017లో భారీ వర్షాల కారణంగా టెయిలింగ్‌పాండ్‌కు నీరుచేరి ఆ నీరు వాగులు, వంకల్లో ప్రవహించి భూగర్భ జలాలు కలుషితం అయ్యాయంటూ నిరసనలు మొదలయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు కేకే కొట్టాల, కనంపల్లె, ఎం.తుమ్మలపల్లె తదితర గ్రామాల నుంచి భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయని, పంటలు పండడం లేదని తీవ్ర నిరసనలు వ్యక్తమవుతూ వస్తున్నాయి. అయినా యూసీఐఎల్ ఎప్పటికప్పుడు మట్టి నమూనాలను పరీక్షిస్తాం, భూగర్భజలాలు పరీక్షిస్తాం ఏదైనా సమస్య ఉంటే పరిష్కరిస్తామంటూ చెప్తూ వచ్చిందే కానీ సమస్యలు పరిష్కరించలేదు. ఇపుడు టెయిలింగ్‌పాండ్ పూర్తిస్థాయిలో నిండింది. దీని విస్తరణ సాగితేనే యూసీఐఎల్ కర్మాగారం పనిచేస్తుంది.

ప్రజల సమస్యలు పరిష్కరిస్తేనే..

యూసీఐఎల్ పరీవాహక గ్రామాలైన కనంపల్లె, కేకే కొట్టాలకు సంబంధించిన ప్రజల డిమాండ్లు తీరిస్తేనే టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులు ముందుకు సాగుతాయి. ఇప్పటికే పలుమార్లు యూసీఐఎల్ టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులను వీరు అడ్డుకున్నారు. దీనితో కలెక్టర్, ఆర్డీవోలు రైతులతో మాట్లాడారు. అక్కడి పంట పొలాలను యూసీఐఎల్ తీసుకోవాలని, అలాగే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని వీరు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే తమ భూములను, ఇళ్లను యూసీఐఎల్ స్వాధీనం చేసుకుని నష్టపరిహారం చెల్లిస్తే గ్రామాలు వదిలి వెళ్తామని అంటున్నారు. యూసీఐఎల్ ఈ డిమాండ్లకు ఒప్పుకొనేందుకు సిద్ధమైంది. కానీ పూర్తిస్థాయిలో అమలుకు గడువుకావాలని కోరుతోంది. ఇందుకు ప్రజలు ఒప్పుకోవడం లేదు. దీనికి కారణం.. గతంలో అనేకసార్లు సమస్యల పరిష్కారం విషయంలో యూసీఐఎల్ మాట ఇచ్చి అమలు చేయకపోవడమే అంటున్నారు. తమ సమస్యలు పరిష్కారం అయితేనే టెయిలింగ్‌పాండ్ విస్తరణ పనులు సాగనిస్తామని ఆ గ్రామాల ప్రజలు తేల్చి చెబుతున్నారు. ఏదిఏమైనా టెయిలింగ్‌పాండ్ సమస్య పరిష్కారం కాకపోతే యూసీఐఎల్ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని అంటున్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయండి

- డీసీఎంఎస్ చైర్మన్ జయప్రకాశ్

కడప ఎన్జీఆర్ సర్కిల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) అభివృద్ధికి పాలకవర్గంతో పాటు సిబ్బంది ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ సంస్థ చైర్మన్ జయప్రకాశ్ అన్నారు. స్థానిక డీసీఎంఎస్ సమావేశ మందిరంలో సోమవారం 92వ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ మాట్లాడుతూ వ్యాపారాన్ని విస్తరించి మరింత ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు ప్రణాళిక రూపొంచామన్నారు. ఏపీ మార్క్‌ఫెడ్ నుంచి రావాలసిన కమీషన్ల బకాయిలను చెల్లించాలంటూ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. డీసీఎంఎస్ వినిమయ కేంద్రాలను పునరుద్ధరించి తద్వారా రైతులకు అవసరమైన సేవలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నికర ఆస్తుల ద్వారా మరింత ఆర్థిక అభివృద్ధిని పెంపొందించేందుకు ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సహకారశాఖ అధికారి వెంకటసుబ్బయ్య మాట్లాడతూ చాలా చోట్ల సొసైటీలు వ్యాపారాలను కొనసాగిస్తూ ఆర్థిక అభివృద్ధిని సాధించాయన్నారు. ఎక్కడైనా ఏదైనా సమస్య వచ్చినా సమష్టిగా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వల్లూరు సింగల్ విండో ప్రెసిడెంట్ లేబాక నాగేశ్వర్‌రెడ్డి, డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ గోపినాయక్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ ఖాదర్‌వల్లి తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోనే వదిలేశారు...!

- కోత దశకు చేరిన ఉల్లి
- రేటు లేక రైతు కంట తడి

7

రాజ్యాంగం పట్ల మాలలు అవగాహన పెంచుకోవాలి

- రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ర్యాలీలో మాజీ ఎంపీ




రాజ్యాంగ పరిరక్షణ యాత్ర ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎంపీ చింతా మోహన్


కడప మారుతీనగర్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం పట్ల మాలలు అవగాహన పెంచుకోవాలని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత చింతా మోహన్ సూచించారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్ర పేరుతో 26వ తేదీ నుంచి రాయలసీమ వ్యాప్తంగా పర్యటిస్తున్న మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు సోమవారం కడప చేరుకున్నారు. ఆయనకు చింతా మోహన్ స్వాగతం పలికి మద్దతు ప్రకటించారు. అనంతరం కడప స్టేట్ గెస్టహౌస్ నుంచి ఆర్టీసీ బస్టాండు వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు తమ సత్తాచాటాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సామాజికగా అభివృద్ధి చెందేందుకు చర్యలు చేపట్టకుండా వర్గీకరణ విషయంలో ఇద్దరి మధ్య అగాధం సృష్టించారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు కావస్తున్నా ఇప్పటికీ గూడులేక మాలలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాలలకు ఎలాంటి కులవృత్తి లేక కేవలం చదువుపై దృష్టి పెట్టారన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మాలలకు 20 శాతం రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు లెనిన్ ప్రసాద్, పవన్, నవీన్‌తో పాటు జైభీం మాలమహాసేన అధ్యక్షుడు సంపత్‌కుమార్, చైతన్య తదితరులు పాల్గొన్నారు. కాగా .. ర్యాలీకి ముందు చింతామోహన్ కడప ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఫెయిల్ అయ్యారని అన్నారు. ఇటీవల కేంద్రప్రభుత్వం జీఎస్టీ తగ్గించామని చెబుతున్నది మాటల గారడి తప్ప చేతల్లో ధరలు తగ్గలేదన్నారు. అసెంబ్లీలో ఒకప్పుడు పేదల గురించి మాట్లాడేవారని, ప్రస్తుతం ఆ పోకడ పోయి లేనిపోని చెత్త వాగుడు వాగుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సామాజిక న్యాయం ముసుగులో ప్రజలను దగా చేయకుండా రాష్ట్రాన్ని మంచిగా పాలించి ప్రజల మన్ననలు అందుకోవాలని సూచించారు.


చదువుల తల్లికి వందనం


కడప అమ్మవారిశాలలో సరస్వతీదేవి అలంకారం



లలితా పంచాయతన దేవాలయంలో సరస్వతీదేవి అలంకారం


బిందెసేవలో ప్రొద్దుటూరు కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం నిర్వాహకులు


అమ్మవారిశాలలో కిటకిటలాడుతున్న భక్తులు



ప్రొద్దుటూరులో సరస్వతీదేవిగా కొలువుదీరిన కన్యకాపరమేశ్వరి


మహాగౌరీదేవి అలంకారంలో విజయదుర్గాదేవి


దేవునికడపలో తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న గోవిందుడు

కడప కల్చరల్ / ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలు జిల్లాకు ఆధ్యాత్మిక శోభ తెచ్చాయి. జిల్లాలోని ఆలయాలు దీపాకాంతులతో మిరుమిట్లు గొలుపుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు సోమవారం అమ్మవారు సరస్వతీమాత రూపంలో దర్శనమిచ్చారు. కడప నగరంలోని అమ్మవారిశాలవీధిలో కన్యకాపరమేశ్వరి, రాజరాజేశ్వరిదేవి ఆలయంలో లలితా పంచాయతన దేవాలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బిల్టప్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు మహాగౌరీదేవిగా భక్తులను కరుణించారు. రాజారెడ్డివీధిలోని గంగమ్మ సంతానలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎర్రముక్కపల్లెలోని చౌడేశ్వరిదేవి సరస్వతీదేవి అలంకారంలో అనుగ్రహించారు. దేవుని కడప ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి.

వైభవంగా బిందెసేవ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రొద్దుటూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి బిందెసేవ మహోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. కలశాలలోకి అమ్మవారిని ఆవాహన చేసి వాసవీ నామస్మరణతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. చిక్‌మంగళూరుకు చెందిన కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాజరాజేశ్వరీదేవి ఆలయం, శివాలయం, చౌడేశ్వరీదేవి ఆలయం, సత్యనారాయణస్వామి ఆలయం నిర్వాహకులు మంగళవాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, కళాకారుల ప్రదర్శనలతో పురవీధుల్లో బిందెసేవ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆటో బోల్తా.. యువకుడు మృతి


మృతిచెందిన కృష్ణ భగవాన్

మదనపల్లెఅర్బన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడిన ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సోమవారం మదనపల్లె మండలం, బసినికొండ సమీపంలోని సయ్యద్‌కార్స్ వద్ద ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వాల్మీకి వీధికి చెందిన నరసయ్య కుమారుడు కృష్ణ భగవాన్ (28)ఆటో నడుపుతూ అదుపు తప్పి ఆటోకింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాలుకా పోలీసులు సంఘటన స్థలం చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తూ యువకుడు..


మృతిచెందిన యువకుడు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 29: లక్కిరెడ్డిపల్లె ప్రాంతంలో విద్యుత్‌లైన్ మరమ్మతులు చేస్తుండగా పశ్చిమబెంగాల్‌కు చెందిన సంజయ్ (32) ప్రమాదవశాత్తు లైన్లు తగిలి సోమవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు పశ్చిమబెంగాల్ రాష్ట్రం పూర్వవర్ధమాన్ జిల్లా రామగోపాల్పూర్‌కు చెందినవాడని, గత కొంతకాలంగా ఓ కాంట్రాక్టర్ కింద లైన్‌మెన్‌గా, సహాయకుడిగా పనిచేస్తున్నాడని, కుర్నూతల మూలపల్లి ప్రాంతంలో విద్యుత్ లైన్లు బిగిస్తుండగా ప్రమాదవశాత్తు వైరు తగులుకొని మృత్యువాత పడ్డాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని, స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ...


రెడ్డిశేఖర్ మృతదేహం

కలకడ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడు రెడ్డిశేఖర్ (19) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ రామంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు... కోన గ్రామవాసి శివశంకర్ కుమారుడు రెడ్డిశేఖర్ రాయచోటిలోని ఓ కళాశాలలో ఐటీఐ చదువుకుంటున్నాడు. పరీక్షల ఫీజు కోసం తండ్రిని డబ్బులు అడుగగా సర్దుబాటు చేసి పంపుతానని సమాధానం ఇచ్చాడన్నారు. దీంతో మనస్థాపం చెంది 27న ఇంటికి సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో వుండగా కుటుంబ సభ్యులు తిరుపతి రుయా ఆసుపత్రిలో చేర్పించారు. కాగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

10 నుంచి సౌత్ ఇండియా లెవల్ క్యారమ్స్ పోటీలు

నందలూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వేకేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో యంగ్‌మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సౌత్‌ఇండియా లెవల్ క్యారమ్స్ పోటీలు అక్టోబరు నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కమిటీ వారు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సోమవారం మాట్లాడుతూ పోటీలో పాల్గొనదలచిన వారు అక్టోబరు 5వ తేదీ లోపు ఎంట్రీలు పంపాలని తెలిపారు. కార్యమ్స్ పోటీలు(స్ట్రైట్ గేమ్స్) ఉంటాయని తెలియజేశారు. ఎంట్రీలను బీఎస్ శంకర్, ప్రెసిడెంట్ యమ్‌మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ నందలూరు, అన్నమయ్య జిల్లా వారికి పంపాలని తెలిపారు. ఈ పోటీల్లో డబుల్స్ విన్నర్స్‌కు రూ.40 వేలు, డబుల్ రన్నర్స్‌కు 25 వేలు, సింగిల్స్ విన్నర్స్‌కు రూ.25 వేలు, సింగిల్ రన్నర్స్‌కు రూ.15 వేలు, డబుల్స్ సెమిఫైనల్ లూజర్సుకు రూ.12 వేలు, సింగిల్ సెమీఫైనల్ లూజర్స్‌కు రూ.8 వేలు, డబుల్ క్వార్టర్ ఫైనల్ లూజర్స్‌కు రూ.12 వేలు, సింగిల్ క్వార్టర్ ఫైనల్ లూజర్స్‌కు రూ.6 వేలు, బెస్ట్ ప్లేయర్ అవార్డుకు రూ.5 వేలు, క్యారమ్స్ పోటీల్లో ఓపెన్ ఫినిషింగ్ చేస్తే రూ.1000 ఇవ్వడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు క్రీడాకారులకు భోజన సౌకర్యం కమిటీవారు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. వివరాలకు 7732054403ను సంప్రదించాలని టోర్నమెంట్ నిర్వాహకులు కోరారు.

ఉపాధ్యాయుడికి జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయుడు రాజశేఖర్

చిట్వేలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల బోధకుడిగా, ఎన్‌సీసీ అధికారిగా ఉత్తమ సేవలు అందించినందుకు ఉపాధ్యాయుడు పసుపుల రాజశేఖర్‌ను ఆచార్య దేవోభవ జాతీయ పురస్కారం 2025 వరించింది. ఈ మేరకు ఆదివారం బాపట్ల జిల్లా వేటపాలెంలో యువతేజం ట్రస్టు, కలాం విజన్ సంస్థల ఆధ్వర్యంలో తెలంగాణ హైకోర్టు చీఫ్ సూపరింటెండెంట్ పీవీసీ అంజలికుమారి, సంస్థ చైర్మన్ ఎస్.కరీముల్లా, డాక్టర్ నారాయణస్వామి ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ బోధన సామాజిక సేవా రంగాలకు చేస్తున్న కృషికి గాను అవార్డు దక్కిందని, ఇది బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు రాజశేఖర్‌ను అభినందించారు.

హరూన్ బజాజ్ మేళాకు విశేష స్పందన

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఏడాది నిర్వహించే హరూన్ బజాజ్ మెగా మేళా అండ్ ఎక్స్ఛేంజ్ ఈ ఏడాది కూడా విపరీతంగా ఆకట్టుకుందని హరూన్ బజాజ్ ఎండీ అహ్మద్‌బాషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ వాహన ప్రదర్శన, ఎక్స్ఛేంజ్ ఆఫర్లు, ఆకర్షణీయమైన డిస్కౌంట్లు, ప్రత్యేక ఫైనాన్స్ సౌకర్యాలు వంటి ఎన్నో అవకాశాలతో ఈ కార్యక్రమం వినియోగదారుల నుంచి విశేష స్పందన పొందిందన్నారు. పాత వాహనాలను మోడరన్ బజాజ్ మోడల్స్‌కి మార్చుకోవాలనుకునే వారికి ఈ మేళా ఒక గొప్ప అవకాశమని, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా అందుబాటులోకి తెచ్చిన మోడల్స్, తక్కువ డౌన్‌పేమెంట్‌కి తీసుకునే అవకాశాలు పెద్దఎత్తున ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ప్రతి సంవత్సరం తమ మెగా మేళా వినియోగదారుల విశ్వాసానికి అద్దం పడుతూ సక్సెస్ అవుతుందన్నారు. ఈ సారి కూడా అదేస్థాయిలో మద్దతు లభించడం ఆనందంగా ఉందని ఆయన తెలిపారు.



కస్టమర్‌కు వాహనాన్ని అందిస్తున్న హరూన్ బజాజ్ సంస్థ ప్రతినిధులు

సీతాఫలం సాగు... భలే బాగు...!

- సహజసిద్ధంగా కాసిన కాయలు
- తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి
- పలు పట్టణాలకు తరలింపు
- కూలీలకు దొరుకుతున్న ఉపాధి


బురకాయలకోటలో ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్న సీతాఫలం కాయలు



ములకలచెరువు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎలాంటి రసాయనాలు... పురుగుల మందులు వాడకుండా పండే ఫలం సీతాఫలం. ఎంతో మధురమైన ఈ కాపు ఈ ప్రాంతంలోని అడవులు, కొండలు, గుట్టల్లో స్వచ్ఛమైన వాతావరణంలో సహజ సిద్ధంగా పెరుగుతాయి. రెండు నెలలుగా వర్షాలు బాగా కురవడంతో సీతాఫలం కాయల దిగుబడి బాగా ఉంది. జిల్లాలోనే ములకలచెరువు మండలం బురకాయలకోట సీతాఫలానికి ప్రసిద్ధి గాంచింది. ఇక్కడి నుంచి ప్రతి రోజు మన రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఇక్కడ సహజసిద్ధంగా కాసే సీతాఫలం కాయలు ఎంతో మధురంగా, రుచిగా ఉండడంతో బాగా డిమాండ్ ఉంటుంది.

నియోజకవర్గంలోని ములకలచెరువు మండలం బురకాయలకోట, దేవళచెరువు, సోంపాళ్యం, కాలువపల్లె, నల్గొండ, బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్, గట్టు, తంబ ళ్లపల్లె మండలం కోసువారిపల్లె, ముద్దలదొడ్డి, పెద్ద తిప్పసముద్రం మండలం కందుకూరు, బి.కొత్తకోట మండలం బయప్ప గారిపల్లె, ఉలవలవారిపల్లె, కురబలకోట మండలాలతో పాటు తదితర గ్రామాల సమీపాల్లో అడవులు, కొండలు, గుట్టలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ సీతాఫలం చెట్లు వేలల్లో ఉన్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో సీతాఫలం కాయలు కాస్తాయి. ఈ ప్రాంతాల నుంచి కూలీలు కాయలను కోసుకొచ్చి బుర కాయలకోటలో విక్రయానికి తీసుకొస్తారు. అలాగే సత్యసాయి జిల్లా తనకల్లు, నల్లచెరువు, సరి హద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం బాగేపల్లె, చేలూరు తదితర ప్రాంతాల నుంచి కూడా కాయలను కోసుకొచ్చి విక్రయించేందుకు కూలీలు ఇక్కడికి తెస్తున్నారు. ఆగస్టు నుంచి నవంబరు ఆఖరు వరకు సీజన్ నడుస్తుంది. ఇక్కడ కూలీల దగ్గర సీతాఫలం కాయలకు వ్యాపారులు కొనుగోలు చేస్తారు. కొనుగోలు చేసిన కాయలను గ్రేడింగ్ చేసి తెలంగాణ రాష్ట్రం మిరియాలగూడ, మహబూబ్‌నగర్, సిరిసిల్ల, మిర్యాలగూడ, హైదరాబాద్, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, సిందనూరు, చాయచూర్, గుల్‌బర్గా, హొస్పేట్, హుబ్లీ, బళ్లారి, దివనగిరి, తమిళనాడు రాష్ట్రం చెన్నై, మధురై, కృష్ణగిరిలతో పాటు మన రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, విశాఖ పట్నం, అనంతపురం, రాజమండ్రి, నంద్యాల తదితర పట్టణాలకు, నగరాలకు ఎగుమతి చేసి విక్రయిస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు అధికంగా కురవడంతో కొండలు, గుట్టల్లో పచ్చదనం పరుచుకుంది. సీతాఫలం కాయలు కూడా బాగా కాశాయి.

కూలీలకు జీవనోపాధి

ప్రతి ఏడాది సీతాఫలం కాయలతో ఈ ప్రాంతాల్లోని కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఆగస్టు నుంచి నవంబరు నెల వరకు సీతాఫలం కాయలు కోసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తారు. సీతాఫలం కాయలు కూలీలకు ఎంతో ఆసరాగా ఉంటుంది. ఇక్కడి కూలీలు ప్రతి రోజు ఉదయమే అడవులు, కొండలు, గుట్టలకు వెళ్లి కాయలు సేకరించి సాయంత్రం బురకాయల కోటకు తీసుకొచ్చి వ్యాపారస్థులకు విక్రయిస్తుంటారు. వ్యాపారులు కూలీల వద్ద నాణ్యతను బట్టి ఒక్కో క్రేటును రూ.350 నుంచి రూ.450 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో కూలీ ప్రతి రోజు రెండు నుంచి ఐదు క్రేట్ల కాయలు సేకరిస్తారు.

ప్రతి ఏడాది సీతాఫలం కాయల సీజన్‌లో బురకాయలకోట కేంద్రంగా భారీగా వ్యాపారం జరుగుతోంది. కూలీల వద్ద కొన్న కాయలను వ్యాపారులు గ్రేడింగ్ చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. బయటి ప్రాంతాల్లో క్రేటు సీతాఫలం ధర రూ.700 వరకు పలుకుతోంది. ప్రతి రోజు బురకాయలకోట నుంచి 800-1000 క్రేట్ల వరకు కాయలు ఎగుమతి అవుతున్నాయి.

జీవనోపాధి దొరుకుతోంది

- గోపాలమ్మ, కూలీ, బురకాయలకోట



సీతాఫలం కాయల ద్వారా జీవనోపాధి లభిస్తోంది. మా ఊరికి సమీపంలో ఉన్న కొండలు, గుట్టల్లోకి ప్రతి రోజూ వెళ్లి రెండు నుంచి ఐదు క్రేట్ల కాయలను కోసుకొచ్చి ఆటోలో తీసుకొచ్చి అమ్ముకుంటున్నాం. ప్రతి రోజు రూ.700 నుంచి రూ.వెయ్యి వరకు ఆదాయం వస్తోంది. వర్షాలు బాగా కురవడంతో కాయలు బాగా ఉన్నాయి.

గొర్రెలు మేపుకొనేందుకు వెళ్లి కోసుకొస్తాను

- గోపి, రంగనాయనిపల్లె



కొండలు, గుట్టల్లోకి గొర్రెలు మేపుకొనేందుకు వెళ్తాను. అక్కడ సీతాఫలం చెట్లు భారీగా ఉండడంతో గొర్రెలు మేపుతూ సీతాఫలం కాయలు కూడా కోసుకొచ్చి విక్రయిస్తున్నాను. ప్రతి రోజూ రెండు క్రేట్ల కాయలు కోసుకొచ్చి బురకాయలకోటలో అమ్ముతాను. రోజు రూ.700 వరకు ఆదాయం వస్తోంది.

నాలుగున్నరేళ్లలో గుంతలమయం చేశారు

- కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ ధ్వజం
- ప్రొటోకాల్ విషయమై వైసీపీ కౌన్సిలర్ల రగడ
- అజెండాలో పలు అంశాలను ఆమోదించని వైసీపీ కౌన్సిలర్లు


కౌన్సిల్‌లో ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్ తులసి

మదనపల్లెటౌన్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): నాలుగున్నరేళ్ల మున్సిపల్ కౌన్సిలర్ల పాలనలో మదనపల్లె పట్టణంలో అభివృద్ధి పనులను అటకెక్కించారని, పలు రోడ్లను గుంతలమయం చేశారని టీడీపీ కౌన్సిలర్ తులసి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌హాల్లో చైర్‌పర్సన్ మనూజ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత కౌన్సిలర్ తులసి మాట్లాడుతూ పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపితే, చైర్‌పర్సన్‌తో పాటు, వైసీపీ కౌన్సిలర్లు ఈ పనులను అజెండాలో పెట్టకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. అధికారం వుంది కదా అని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తప్పుపట్టారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, అభివృద్ధి పనులు చేయించడంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కాని ఆయా వార్డుల్లో కౌన్సిలర్లకు ప్రొటోకాల్ విషయంలో కిందిస్థాయి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వీరిపై కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో 11,800 విద్యుత్ వీధిదీపాలు వుంటే కేవలం నలుగురు లైటింగ్‌మెన్‌లు మాత్రమే పనిచేస్తున్నారని, వీరి సంఖ్య 30కు పెంచాలని చైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్ కరీముల్లా మాట్లాడుతూ 35 వార్డుల నుంచి ప్రతి ఏటా రూ.21కోట్లు పన్నుల రూపంలో నిధులు వస్తుంటే కేవలం కొన్ని వార్డులకే ఈ నిధులు కేటాయించడంపై ఆక్షేపించారు. కౌన్సిలర్ ప్రసాదబాబు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ప్రజలు నివసించే ప్రాంతాలకు రాజ్యాంగం ప్రకారం నిధులు కేటాయించాల్సి వుండగా అది జరగడం లేదని విమర్శించారు. కోమటివానిచెరువు వద్ద మున్సిపల్ స్థలం కబ్జాకు గురవుతోందని, దాన్ని కాపాడాలని కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. కౌన్సిలర్లు బీఏ ఖాజా, అర్జున తదితరులు పలు అంశాలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వీటన్నింటిపై చైర్‌పర్సన్ స్పందిస్తూ సమావేశంలో లేవనెత్తిన అంశాలపై చర్చించి వచ్చే సమావేశంలో నిర్ణయాలు తీసుకుంటామన్నారు. కాగా చైర్‌పర్సన్ మనూజ తీర్మానించి రూపొందించిన అజెండాలోని కొన్ని అంశాలను మెజారిటీ వైసీపీ కౌన్సిలర్లు మూకుమ్మడిగా వ్యతిరేకిస్తూ ఆమోదించలేదు. సమావేశంలో వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, కౌన్సిలర్లు ఫర్హానా, సరిత, గిరిజ, రాజేష్, మున్సిపల్ మేనేజర్ మనోహర్, ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో పట్టుబడ్డ నిందితుడు

- 95 గ్రాముల బంగారం, పల్సర్‌బైకు స్వాధీనం


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ

రాజంపేటటౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వత్తలూరు వడ్డిపల్లెకు చెందిన మహిళపై దాడిచేసి పరారైన నిందితున్ని పుల్లంపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో ఏఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు ఈ నెల 10న వత్తలూరు వడ్డిపల్లె గ్రామానికి చెందిన ఏరుకాల్వ రమాదేవిపై దాడిచేసి పరారైన పీలేరు మండలం బోడుమల్లివారిపల్లెకు చెందిన వేముల విశ్వనాథం అలియాస్ ఊసోడును పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద సోమవారం అరెస్ట్ చేశామన్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.9.50 లక్షలు విలువ చేసే 93.030 గ్రాముల బంగారం, పల్సర్ బైకు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. చిత్తూరు జిల్లా సదుం పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసు, పుల్లంపేట పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి బంగారం రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడిని పట్టుకుని బంగారం రికవరీ చేసినందుకు రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, పుల్లంపేట ఎస్‌ఐ శివకుమార్, పెనగలూరు ఎస్‌ఐలను అడిషనల్ ఎస్పీ రామ్‌నాథ్‌హెగ్డే అభినందించారు.

'ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం'


మాట్లాడుతున్న అశోక్‌బాబు

నందలూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.అశోక్‌బాబు అన్నారు. సోమవారం నందలూరుకు చేరుకున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు దళిత నాయకులు స్వాగతం పలికారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో అశోక్‌బాబును ఘనంగా సత్కరించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాలలు అన్ని విధాలుగా నష్టపోతారన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం సంజీవ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు అనూహ్య స్పందన వస్తోంద న్నారు. ఈ కార్యక్రమంలో మోడపోతుల రాము, ఆర్ముగం విశ్వనాథ్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, నాయనపల్లి ఆదినారాయణ, తుమ్మిది శివకుమార్, గుడిసె సుబ్రమణ్యం, ఎముక దుర్గయ్య, శివ నరసింహులు, సురేష్, నాగభూషణం, నాగరాజు, డిస్కో మణి తదితరులు పాల్గొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

కలకడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భూమి విషయంగా ఘర్షణ పడ్డ ఇరు వర్గాల్లోని నలుగురిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. బాలయ్యగారిపల్లి పంచాయతీ ఝురిగడ్డ వాసులైన తిరుమలేశు, వెంకటరాయుడుకు భూ తగదాలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో భూమి వద్ద ఇరువర్గాలు గొడవ పడి కర్రలతో దాడి చేసుకున్నట్లు తెలిపారు. ఘటనలో ఓ వర్గంలోని తిరుమలేశు, చంద్రకళ మరో వర్గంలోని వెంకటరాయుడు, సరస్వతిలకు గాయాలైనట్లు చెప్పారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్

- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్


గాలివీడులో గంజాయి విక్రయదారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

గాలివీడు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుట్టుగా సాగుతున్న గంజాయి బ్యాచ్‌పై పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లె ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ తన సిబ్బందితో కలిసి సోమవారం ఉదయం గాలివీడు పట్టణంలో ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఇదే విషయమై సీఐ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా రెక్కీ నిర్వహించిన అనంతరం పక్కా సమాచారంతో చిలకలూరిపేట వద్ద గుడిసెల్లో నివాసం ఉంటూ గంజాయిని విక్రయిస్తున్నట్లు గుర్తించామని, ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని ఫోన్ ద్వారా గంజాయి క్రయ విక్రయాలు సాగిస్తున్న మరో ఇద్దరు యువకులను గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ముగ్గురిని అదుపులోకి తీసుకుని లక్కిరెడ్డిపల్లెకు తరలించి విచారిస్తున్నామన్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి గంజాయి మూలాలను సమూలంగా కూకటివేళ్లతో పెకిలించి వేసేలా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు ఎంపిక


సౌత్‌జోన్ కబడ్డీకి ఎంపికైన విద్యార్థిని పెంచలయ్య

రైల్వేకోడూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిడిగ్రీ కళాశాలలో బీకాం 3వ సంవత్సరం చదువుతున్న బోయ శివకుమార్ సౌత్‌జోన్ కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబడ్డీ ఎంపికలో తమ కళాశాల విద్యార్థి విశేషంగా ప్రతిభను కనబరిచాడని తెలిపారు. సౌత్‌జోన్ కబడ్డీ పోటీలు త్వరలో కర్ణాటకలోని రాణి చెన్నమ్మ యూనిర్శిటీలో జరగనున్నాయని తెలిపారు. సౌత్‌జోన్ పోటీల్లో కూడా తమ విద్యార్థి రాణించాలని ఆయన అభినందించారు.

టైర్ పేలి అరటికాయల వాహనం బోల్తా


బోల్తా పడ్డ అరటికాయల వాహనం

ములకలచెరువు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): టైర్ పగిలి అరటి కాయల లోడుతో వెళ్తున్న వాహనం బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా కదిరి నుంచి మదనపల్లెకు అరటి కాయలు తీసుకెళ్తున్న బొలేరో వాహనం సోమవారం ముంబై-చెన్నై జాతీయ రహదారిలోని సెంట్రల్ స్కూల్ వద్దకు రాగానే టైరు పగిలింది. దీంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.


చల్లబసాయిపల్లెలో తొలగించిన ఉల్లి పంటను పొలంలోనే వదిలేసిన దృశ్యం

పొలాల్లోనే వదిలేశారు...!

- కోత దశకు చేరిన ఉల్లి
- రేటు లేక రైతు కంట తడి

దువ్వూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటను సాగు చేసిన రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. అష్టకష్టాలకు ఓర్చి పంట సాగు చేస్తే గిట్టుబాటు ధర లేక రైతులు కంటతడి పెడుతున్నారు. ఇప్పుడిప్పుడే పంట కోత దశకు చేరుకుంటోంది. ధర లేకపోవడంతో పండిన పంటను కొనుగోలు చేసే వారు లేకపోవడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు.

దువ్వూరు మండలంలో పెద్దబళ్లారితోపాటు కేపీ ఉల్లి పంటను రైతులు విరివిగా సాగు చేస్తారు. ఈ ఏడాది జూన్ మొదటి వారంలో గుడిపాడు, దువ్వూరు, రాంసాయినగర్, మూడిండ్లపల్లె, దాసరిపల్లి, నీలాపురం, మదిరేపల్లె, చిన్నసింగనపల్లె, రామాపురం, మనేరాంపల్లె ప్రాంతాల్లో పెద్దబళ్లారి రకం ఉల్లి సాగు చేశారు. మండలంలో 1200 ఎకరాల మేరకు ఉల్లి సాగైందని వ్యవసాయశాఖ తెలుపుతోంది. ముఖ్యంగా సాగుకు ఎకరాకు రూ.60 వేలు దాకా పెట్టుబడుల కింద ఖర్చు చేశారు. మధ్యలో అకాల వర్షాలు పంటను దెబ్బతీస్తూ వచ్చాయి. అవాంతరాలను ఎదుర్కొని ఎట్టకేలకు దిగుబడులు చేతికందుతున్నాయి. ఈ సమయంలో ధర పతనమై కొనుగోలుదారులు ఎవరూ ముందుకు రావడం లేదు. గత ఏడాది క్వింటా రూ.3 వేలు ధర ఉండగా, ఈ ఏడాది రూ.600 నుంచి 700 కూడా లేదు. ఇక ప్రభుత్వం రూ.1200లతో కొనుగోలు చేస్తామని చెప్పినప్పటికీ అమలు కావడం లేదు. దీంతో పంటను ఒడిపేందుకు రైతులు తటపటాయిస్తున్నారు. కొందరు రైతులు మాత్రం అక్కడక్కడ పంటను తొలగించారు.

వర్షాలకు పొలంలోనే...

మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా.. అసలే ఉల్లికి గిట్టుబాటు ధర లేదని ఆందోళనలో ఉన్న రైతులను వర్షం కోలుకోలేని దెబ్బతీసింది. ఉల్లి పంటను తొలగించాక వర్షం పడటంతో గడ్డలను వేరు చేయకుండా పొలంలో అలాగే వదిలేశారు. ధర లేకపోవడంతో ఖర్చులు నెత్తికొస్తాయనే భయంతో వదిలేశారు. కాగా, మరో పది రోజుల్లో మరికొంత మంది రైతులు పంటను ఒడిపేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉల్లి కొనుగోలు కేంద్రం వైపు రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే బాసటగా ఉంటుందని... ఈదిశగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చొరవ తీసుకోవాలని సంబంధిత రైతులు కోరుతున్నారు.

వాతావరణం అనుకూలించలేదు



నేను రెండు ఎకరాల్లో పెద్దబళ్లారి ఉల్లి వేశాను. వాతావరణం అనుకూలించకపోవడంతో పంట తీసి పొలంలోనే వదిలేశాను. ఎకరాకు రూ.40వేలు పెట్టుబడి అయింది. రూ.80వేలు నష్టపోయాను. పంట తొలగించాలంటే నాతోటి రైతులు భయపడుతున్నారు.

\- రుద్రారెడ్డి, రైతు, చల్లబసాయిపల్లె, దువ్వూరు మండలం

రైల్వే ట్రాక్షన్ అప్‌గ్రేడ్ ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- జిల్లాలో గుంతకల్-కడప మధ్య భూసేకరణ

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే పరిధిలో రైల్వే ట్రాక్షన్ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. రైల్వే చట్టం 1989లోని సెక్షన్ 2 (37ఎ) ప్రకారం 1.25 కేవీ నుంచి 2.25 కెవీ విద్యుత్ ట్రాక్షన్ సిస్టమ్ అప్‌గ్రేడేషన్ పనులను ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా ప్రకటిస్తూ కేంద్రం అధికారిక నోటిఫికేషన్ ఈనెల 24వ తేదీ జారీ చేసినట్లు ప్రాజెక్టు అధికారి అమిత్ అగర్వాల్ తెలిపారు. ఈప్రాజెక్టు కింద దేశవ్యాప్తంగా 3000 మెట్రిక్ టన్నుల లోడింగ్ లక్ష్యాన్ని సాధించాలన్న దిశగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ నేపథ్యంలో కడప జిల్లాలో ముద్దనూరు, కడప మధ్య భూసేకరణ చేపట్టనున్నారు. ఈ భూసేకరణ ప్రజాప్రయోజనం కోసం జాతీయ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా జరుగుతుందని తెలిపారు.

సమ్మెలో పాల్గొన్న డాక్టర్లు


చాపాడు ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ కుర్చీ

చాపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ కోర్కెలు నెరవేరేవరకు పలు రకాల పద్ధతుల్లో నిరసనలు తెలుపుతామని డాక్టర్లు పేర్కొన్నా రు. రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం చాపాడు, నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న డాక్టర్లు శివప్రసాద్‌రెడ్డి, శ్రీవాణి, కావ్య మాధురి సమ్మెలో పాల్గొన్నారు. డాక్టర్లు ఆస్పత్రులకు వచ్చి రోగులకు పరీక్షలు చేయకుండా విధులకు దూరంగా ఉన్నారు. ప్రభుత్వం పీజీ కాలేజీల్లో అడ్మిషన్ల విషయమై 50 శాతం కోటాను రద్దు చేయాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. కాగా, ఆస్పత్రిలో ఉన్న స్టాఫ్‌నర్సులు భాగ్యవతి, సునీతలు రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

జిల్లా ఎస్పీని కలిసిన ఎమ్మెల్యేలు


ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు ఆది, పుట్టా

జమ్మలమడుగు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తగా జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నచికేత్ విశ్వనాథ్‌ను సోమవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎస్పీతో స్థానిక సమస్యలపై మాట్లాడినట్లుగా తెలిసింది.

అర్ధరాత్రి తాగి వీరంగం... నలుగురు యువకులపై కేసు నమోదు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలో శనివారం అర్ధరాత్రి తాగి వీరంగం చేసిన నలుగురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నలుగురు యువకులు తాగి అల్లరి చేస్తుండగా కానిస్టేబుల్ మందలించడంతో గొడవకు దిగారు. దీంతో కానిస్టేబుల్ బ్లూకోల్ట్స్ పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో వారు నలుగురు యువకులను టూటౌన్ పోలీసు స్టేషనుకు తీసు కెళ్లారు. సీఐ సదాశివయ్య వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సెల్‌ఫోన్లు తీసు కొని అడ్రస్సులు, సంతాకాలు తీసుకొని ఇంటికి పంపారు. ఈ విషయం ఎస్పీ విశ్వనాథ్ దృష్టికి వెళ్లింది. ఆయనే స్వయంగా సీఐకి ఫోన్ చేసి జరిగిన సంఘటనపై వివరణ కోరారు. అనంతరం ఇలాంటి ఘట నలను ఉపేక్షించవద్దని తెలిపారు. దీంతో నలుగురిని విచారించగా వీరి లో పిట్లా వెంకటచరణ్, కాటం సాయి తేజపై పలు స్టేషన్లలో క్రికెట్ బెట్టింగ్, జూదం కేసులు వున్నాయి, కాటం వీరేంద్రనాథ్, మరో యువ కుడు మహేష్‌పై ఒక కేసు వుంది. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సదాశివయ్య తెలిపారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడి చేసిన ఇద్దరిపై..

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా పనిచేస్తున్న మండల ఈవోపీఆర్‌డీ రామాంజనేయరెడ్డి రెండు రోజుల క్రితం రాత్రివేళ బార్‌లో ఉండగా ఎస్సీ జన సంఘం అధ్యక్షుడు పెద్దిరాజు, దాసరి శివక్రిష్ణ అనే వ్యక్తులు దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. పెద్దిరాజు కొత్తపల్లెలో కాలువ ఆక్రమణపై ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదుపై చర్యలు తీసుకోకుండా క్లోజ్ చేస్తావా అంటూ కార్యదర్శి రామాంజనేయరెడ్డిని దుర్భాషలాడుతూ దాడి చేశా రు. పంచాయతీ కార్యాలయానికి వచ్చి మాట్లాడమని, ప్రైవేటు ప్రదే శంలో ఉన్నపుడు అడిగితే ఏం సమాధానం చెబుతామని చెప్పినా విన కుండా దాడి చేశారని టూటౌన్ పోలీసుస్టేషన్‌లో రామాజంనేయ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పెద్దిరాజు, దాసరి శివక్రిష్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ సదాశివయ్య తెలిపారు.

పాము కాటుకు వివాహిత మృతి

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని యు.వెంకటాపురం గ్రామానికి చెందిన సుంకన్నగారి సువర్ణ (28) అనే మహిళ పాముకాటుకు మృతి చెందింది. శనివారం తన పొలం వద్ద ఉన్న గడ్డిని గొర్రె పిల్లల కోసం కోస్తుండగా గడ్డిలో ఉన్న పాము కాటు వేసింది. వెంటనే చికిత్స కోసం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలిం చారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్సకు కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందినట్లు ఆమె బంధువులు తెలిపారు.

ఆలయ హుండీలో చోరీ

మైలవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొమ్మర నంద్యాల గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గుడి తాళం తీసి ఆలయ హుండీలో ఉన్న నగదు చోరీ చేశారు. సోమవారం ఉదయం ఆలయ ధర్మకర్త నరసింహులు గుడిలోకి వెళ్లి చూడగా హుండీకి ఉన్న తాళం తీసి అందులో ఉన్న దాదాపు రూ.6వేలు దొంగతనం చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు మైలవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత


మొబైల్ ఫోన్‌ను బాధితురాలికి అప్పగిస్తున్న పోలీసులు

కడప క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై తనకు దొరికిన ఐఫోన్‌ను వెంటనే పోలీసుస్టేషన్‌కు వచ్చి అప్పగించి ఓ వ్యక్తి తన నిజాయితీని నిరూపించుకున్నాడు. వివరాలిలా.. చిన్నచౌకు పోలీసు స్టేషన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన బయనబోయిన కిరణ్‌కుమారి ఆదివారం బట్టలు కొనుగోలు చేసేందుకు ఇంటి నుంచి షాపింగ్ మాల్ వెళుతుండగా తన రూ.80వేలు విలువ చేసే ఐఫోన్ పోగొట్టు కుంది. ఆమె వెంటనే చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదే క్రమంలో ఆర్టీసీ కాలనీకి చెందిన ముత్యాలపాడు శ్రీనివాసులుకు బ్రహ్మయ్య షెడ్డు వద్ద మొబైల్ ఫోను దొరకగా అయన స్టేషన్‌కు వచ్చి సీఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డికి అప్పగించారు. దీంతో శ్రీరా ములును పోలీసులు అభినందించారు. సోమవారం బాధితురాలిని పిలిపించి ఫోన్‌ను అప్పగించారు. దీంతో బాధితురాలు శ్రీరాములుకు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

స్వర్ణకార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగారు షాపుల్లో పనిచేసే కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో అయిదు వేల మంది బంగారు పనిచేసే కార్మికులు ఉన్నారని, ఇటీవల కాలంలో బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోవడం, అ కార్పొరేట్ షాపింగ్ మాల్స్ రావడంతో కార్మికులకు పనిలేకుండా పోయిందన్నారు. దీంతో కుటుంబ పోషణ కోసం కార్మికులు వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో శేఖర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ముగిసిన ఆలిండియా చిల్డ్రన్ ఫెస్టివల్

- అలరించిన నృత్య ప్రదర్శనలు
- బహుమతులు ప్రదానం





ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, శశిభూషణ్‌రెడ్డి, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

పులివెందుల రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఇంటిగ్రేటెడ్ స్కిల్ ట్రైనింగ్ అకాడమీలో ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తున్న ఆలిండియా స్కూల్ ఫెస్టివల్ ముగింపు కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డిలు హాజరయ్యారు. నాలుగురోజుల పాటు యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ (యుఎస్ఓ) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల నుంచి దాదాపు 150 మందికిపైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరై వారివారి సంస్కృతి, సంప్రదాయాలను తెలియజెబుతూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. నృత్య ప్రదర్శన, పెయింటింగ్, వక్తృత్వ పోటీలు, జనరల్ క్విజ్ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్ రెడ్డిలు మాట్లాడుతూ బిన్న సంస్కృతులను ఒక్కచోటకు చేర్చి తమ సంప్రదాయాలను తెలియజెప్పే కార్యక్రమాలను నిర్వహిస్తున్న యూఎస్ఓ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. పలు రాష్ట్రాలలోని సంస్కృతులు, సంప్రదాయలు కలిగిన విద్యార్థులు ఒకే వేదికపై వారిలోని సృజనాత్మకను వెలికితీసి, నాణ్యమైన విద్య అందడం కోసం యూఎస్ఓ కృషి మరువలేనిదన్నారు. అలాంటి యూఎస్ఓ సంస్థ పులివెందులలో కార్యక్రమం నిర్వహించడం తమకెంతో సంతోషాన్నిచ్చిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు పులివెందులలో మరిన్ని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో యూఎస్ఓ సెక్రటరీ జనరల్ సీనాజైన్, వైస్ ప్రెసిడెంట్ నిఖిల్ బూమ్రా, నేషనల్‌కౌన్సిల్ మెంబర్ భానుప్రకాష్, బీజేపీ యువమోర్చ జిల్లా కార్యదర్శి వాజ్‌పేయి, పులివెందుల మండల అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దోమల ద్వారా ప్రాణాంతక వ్యాధులు


సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

పులివెందుల రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దోమల ద్వారా ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని జిల్లా మలేరియా అధికారి మనోరమ ప్రజలకు సూచించారు. సోమవారం పట్టణంలో జరుగుతున్న ఫీవర్ సర్వే, లార్వా సర్వే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే వివరాలు తెలుసుకున్నారు. దోమల వల్ల ప్రబలే వ్యాధులను ప్రజలకు వివరించి వారికి అవగాహన పెంపొందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె ప్రజలకు సూచనలిస్తూ ఇళ్లలో, పరిసరాల్లో శుభ్రత పాటించి, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజామొద్దీన్, సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సమస్యలను పరిష్కరించాలని సోమవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి నేషనల్ మజ్దూర్ యూనియన్ (యూనిటీ)కార్మిక నేతలు కోరారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు బ్రహ్మం, రీజినల్ చైర్మన్ శేషన్న మాట్లాడుతూ జమ్మలమడుగు, ప్రొద్దుటూరు రూట్‌లో తిప్పుతున్న నాన్‌స్టాప్ బస్సులను పల్లె వెలుగు బస్సులుగా మార్చి అటు ప్రయాణికులకు, ఇటు ఉద్యోగులకు సమస్యలు లేకుండా చూడాలని వారు కోరారు. ఇందుకు ఆయన సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ రీజినల్ కార్యదర్శి సుధాకర్, గ్యారేజీ కార్యదర్శి ఎస్ఎంవల్లితదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ తెలిపారు. జమ్మలమడుగు సబ్‌జైలును సోమవారం సీనియర్ సివిల్‌జడ్జి తనిఖీ చేశారు. ముందుగా సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. అక్కడున్న వసతులను గురించి ఆరా తీశారు. సబ్‌జైలులో లీగల్ ఎయిడ్ క్లీనిక్‌లను తనిఖీ చేసి, అక్కడున్న రికార్డులను పరిశీలించారు. లీగల్ ఎయిడ్ క్లీనిక్ ప్రాధాన్యతను తెలియజేశారు. జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, రిమాండ్ ఖైదీలతో మాట్లాడి వారి వారి కేసుల వివరాలను, ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. అలాగే కమలాపురం, ప్రొద్దుటూరు జైళ్లను తనిఖీ చేసి లీగల్‌ఎయిడ్ క్లీనిక్‌ల ప్రాధాన్యతను తెలియజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు సబ్‌జైళ్ల సూపరింటెండెంట్లు, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి


కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించాలని కేజీబీవీ డిప్యూటీ డైరెక్టర్ దేవరాజులు తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం నుంచి సిబ్బంది తమ విధులను జాగ్రత్తగా, బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. సోమవారం కడప నగరం యూటీఎఫ్ కార్యాలయంలో కేజీబీవీలో పనిచేస్తున్న సిబ్బందితో సమా వేశం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. తప్పనిసరిగా సిబ్బంది సమయం పాటించాలన్నారు. ఏపీసీ నిత్యానందరాజులు మాట్లాడు తూ పాఠశాలల శుభ్రత, స్వచ్ఛతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట మనుషులు, వాచ్ ఉమెన్, ఏఎన్ఎంలు, అటెండర్లు, స్వీప ర్లు, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మె నోటీసు


ఆర్టీపీపీ సీఈకి సమ్మె పత్రాన్ని ఇస్తున్న జేఏసీ నాయకులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడం లేదంటూ విద్యుత్ ఉద్యోగులు సమ్మె నోటీసు ఇచ్చారు. సెంట్రల్ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు ఆర్టీపీపీ రిజినల్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీపీపీ సీఈని కలిసి వారు సమ్మె నోటీసును ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు అనేక రూపాల్లో ఆందోళన చేసినా.. ప్రభుత్వం నుంచి కనీస స్పందనలేదన్నారు. 1999 నుంచి 2004 మధ్యలో ఉద్యోగంలో చేరిన వారందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికు లకు థర్డ్ పార్టీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా విద్యుత్ సంస్థలే జీతాలు చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పలు దపాలుగా ఆందోళన చేసినప్పటికీ ఇప్పటి వరకు స్పందిం చలేదని విమర్శించారు. అక్టోబరు 6న విశాఖలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నా, 8న తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద నిరసన, 13న చలో విజయవాడ పేరుతో భారీ ఆందోళన, 14న అన్ని సంస్థల్లో వర్క్ టు రూల్ కార్యక్ర మం నిర్వహిస్తామన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించ కపోతే అక్టోబర్ 15 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళుతున్నట్లు ప్రకటించారు.



కడప నగరంలో కమిషనర్ ఆకస్మిక తనిఖీ



కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం నార్త్‌జోన్‌లో సోమవారం కమిషనర్ మనోజ్‌రెడ్డి పలు ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా 1వ డివిజన్ వాటర్ గండి ప్రాంతాన్ని సందర్శించి ప్రజలను కలుసుకున్నారు. ప్రతి ప్రాంతానికి శాశ్వత కార్మికుడిని కేటాయించి కాల్వలు నిరంతరం శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

'కప్పిపుచ్చుకునేందుకే అలగనూరు ప్రస్తావన'

కడప సెవెన్ రోడ్స్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునేందుకే అలగనూరు ప్రస్తావనను కూటమి నాయకులు తెస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర విమర్శించారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా నీటిలో నికరజలాలు కలిగిన కేసీ కెనాల్ చివర ఆయకట్టు స్థిరీకరణ కోసం నిర్మించ తలపెట్టిన రాజోలి రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు రాబట్టడంలో అధినాయకత్వాన్ని ఒప్పించలేక మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అలగనూరు ద్వారా ఆరుతడి పంటలకు నీళ్లు అందిస్తామని అసెంబ్లీలో మాట్లాడడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బాదుల్లా,కొండయ్య తదితరులుపాల్గొన్నారు.

డీఎస్సీకి ముందే అంతర్‌జిల్లా బదిలీలు నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యంగా మెగా డీఎస్సీకి ముందే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయుల అంతర్‌జిల్లా బదిలీలు చేపట్టాలని ఆర్జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కడప నగరం భుజంగరావు స్మారక టీచర్స్ భవన్‌లో ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు ముఖ్య అతిథిగా గౌరవాధ్యక్షుడు ముత్తోజు వీరబ్రహ్మం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, జిల్లా అధ్యక్షుడు ప్రసాదరావు, టీచర్స్ హోం ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కడప వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ బదిలీ

కడప క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వన్‌టౌన్ సీఐగా పనిచేస్తున్న రామక్రిష్ణను వీఆర్‌కు బదిలీ చేస్తూ సోమవారం ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది సెప్టెంబరు 19న వన్‌టౌన్ సీఐగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతమైన ఆయనను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'అక్రమాలపై విచారణ చేపట్టాలి'

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ ఉపాధ్యాయ పోస్టుల నియామకాల్లో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ దర్యాప్తు చేపట్టాలని విద్యార్థి యువజన జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం కలెక్టరేట్ ఎదుట విద్యార్థి యువజన సంఘాల ఏపీసీ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిరసన కార్యక్రమం చేపట్టారు.అనంతరం డీఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఆర్.ఎస్.రాజా, వైస్ చైర్మన్ ఎం.అంకన్న పాల్గొన్నారు.

వైభవంగా బిందె సేవ

చెన్నూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా చెన్నూరు రామలింగ చౌడేశ్వరి ఆలయం నుంచి సోమవారం మధ్యాహ్నం బిందె సేవను వైభవంగా నిర్వహించారు. బిందె కలశాలను తలపై ఉంచుకుని నాట్యం చేస్తూ అమ్మవారి కీర్తనలు పాడుతూ చెన్నూరు పురవీధుల గుండా బిందె సేవ చేశారు. అలాగే సుహాసినీలు తలపై నవదుర్గ ప్రతిమలను ఉంచుకుని అమ్మవారిని ఊరేగించారు.

రామనపల్లెలో వైభవంగా కలశం ఊరేగింపు..: రామనపల్లె చౌడేశ్వరి ఆలయం నుంచి బిందెకలశాలు తలపై ఉంచుకుని ఆ గ్రామ పుర వీదుల్లో ఊరేగింపు నిర్వహించారు.



చెన్నూరులో నవదుర్గల ఊరేగింపు

వాగ్దేవీ.. వందనం...

కడప కల్చరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లాకు ఆధ్యాత్మిక శోభ తెచ్చాయి. ప్రతి ఆలయం దీపకాంతులతో అలరారుతోంది. భారీ సెట్టింగులు, అలంకారాలతో భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఎనిమిదో రోజు సోమవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవారిశాలలో..: నగర అమ్మవారిశాలవీధిలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

రాజరాజేశ్వరి ఆలయంలో..: శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు

లలితా పంచాయతన దేవాలయంలో..: లలితా పంచాయతన దేవాలయంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో కోలాట నృత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

విజయదుర్గాదేవి ఆలయంలో..: నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు మహాగౌరీదేవిగా సోమవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో ప్రదక్షిణకు ముందు చిన్నారుల కోలాటం భక్తులను ఆకట్టుకుంది.

గడ్డిబజారు బాలాజీ ఆలయంలో..: నగర గడ్డిబజారులో వెలసిన శ్రీలక్ష్మి సత్యనారాయణ స్వామి దేవస్థానం (బాలాజీ) లో అమ్మవారు నరసింహస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాజారెడ్డివీధిలో..: నగర రాజారెడ్డివీధిలో వెలసిన గ్రామ దేవత గంగమ్మ ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో..: నగర గడ్డిబజారులో వెలసిన కామకోటి కళాంబదేవి సమేత సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



విజయదుర్గా ఆలయంలో భక్తుల కోలాటం

ఎర్రముక్కపల్లెలో..: ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరిదేవి దేవస్థానంలో అమ్మవారు సరస్వతీ దేవి అలంకారం, శంకరాపురం ఎస్‌బీఐ సమీపంలో వెలసిన అమ్మవారి ఆలయంలో సరస్వతీదేవి అలంకారం, నీయోనుపురం (రాజారెడ్డివీధి)లో వెల సిన శ్రీశక్తిసవారమ్మఅవ్వ దేవస్థానంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే నగర చిన్నబెస్తవీధి బాల పోలేరమ్మ దేవస్థానంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారం, హనుమప్పవీధిలో వెలసిన భద్రావతి సమేత భావనారుషి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వల్లూరు..: వాసవీ కల్యాణమండపంలో ఉన్న వాసవీ దేవి ఆలయంలో సరసతీదేవి అలంకారంలో అమ్మవారు దర్శన భాగ్యం కల్పించారు. అలాగేబిందె సేవ నిర్వహించారు.

చెన్నూరు..: స్థానిక రామలింగచౌడేశ్వరిదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా దర్వనమిచ్చారు.వాగ్దేవి నమోస్తుతే, సరస్వతీ నమస్తుభ్యం అంటూ అమ్మవారిని వేడుకున్నారు.

పెండ్లిమర్రి..: పొలతల మల్లికార్జున స్వామి ఆలయంలో పార్వతీ దేవి అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు.

సీకేదిన్నె..: చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గంగమ్మ తల్లి సరస్వతీదేవి అలంకారంలో దర్శన మిచ్చారు. అదే విధంగా బయనపల్లె ఉమామహేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

వీరపునాయునిపల్లె..: అనిమెల గ్రామం కోరు కొండ కింద ఉన్న బోగాదమ్మ ఆలయంలో సోమవారం అన్నపూర్ణ అలంకరణలో బోగాదమ్మ అమ్మవారు దర్శనమిచ్చారు.

వేంపల్లె..: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో బిందెసేవ నిర్వహించారు. అమ్మవారి శాల కన్యకాపరమేశ్వరీ దేవి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.









వల్లూరు.. సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు, చెన్నూరు వాసవీ కన్యకా ఆలయం, పెండ్లిమర్రి, సీకే దిన్నెలలో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



ఎర్రముక్కపల్లెలో సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు



కడప..రాజరాజేశ్వరిదేవి గుడిలో సరస్వతీదేవి అలంకారం



నడివీధిగంగమ్మతల్లి ఆలయంలో సరస్వతీ అలంకారంలో అమ్మవారు



కడప.. భద్రావతి భావనారుషి ఆలయంలో సరస్వతీదేవి అలంకారం

నూతనకమిటీ ఎన్నిక

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం జై భీమ్ మాల మహాసేన కార్యాలయంలో సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి చైతన్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ సలహాదారులుగా జ్ఞాన ప్రకారం, కొమ్మలపాటి దివాకర్ ఉపాధ్యక్షులుగా దియ్యాల లారెన్స్, రత్నకుమారి, ప్రధాన కార్యదర్శిగా వై.శేఖర్, బందెల రవిశంకర్, కార్యదర్శులుగా వసంత్, రాజామణిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాతబస్టాండు వద్ద బారికేడ్లు ఏర్పాటు

కడప క్రైం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పాత బస్టాండు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. కడప ట్రాఫిక్ సీఐ జావీద్, ఎస్ఐ జయరాములు ఆధ్వర్యంలో ఈ బార్కెట్లు రోడ్డు మధ్యలో ఏర్పాటు చేశారు. నిత్యం ఇక్కడ వాహనాల రద్దీ ఎక్కువ ఉండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండేది. దీనికి తోడు తోపుడుబండ్లు రోడ్డుకు అడ్డంగా ఉండేవి. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రత తగ్గించేందుకు పాత బస్టాండు నుంచి సెవెన్‌రోడ్స్ వరకు రోడ్డు మధ్యలో బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో ఏ వాహనం ఎటు వెళ్లాలో అటు వెళుతుంది. ట్రాఫిక్ సమస్య తీరిపోతుంది.



వృషభాచలేశ్వర ఆలయ అభివృద్ధికి కృషి



ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

వేంపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వృష భాచలేశ్వర దేవస్థాన ఆలయాల అభివృద్ధికి అన్ని విధాలా కృషిచేస్తామని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలోని వృషభాచలేశ్వర ఆలయ అనుబంధ ఆంజనేయస్వామి ఆలయంలో పాలక మండలి చైర్మన్‌గా పాలెగాని వెంకటరమణ ప్రమాణ స్వీకారం చేశారు. బోర్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి సమక్షంలో ఆలయ ఈఓ హనుమంతురావు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, హెచ్ఎల్‌సీ చైర్మన్ జోగిరెడ్డి, మండల కన్వీనర్ మునిరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శశిభూషణ్‌రెడ్డి, బీజేపీ నాయకురాలు సుష్మ, గాలి హరిప్రసాద్, గుణకనపల్లె అమర్‌నాథ్‌యాదవ్, గండి మాజీ చైర్మన్ వెంకటస్వామి, రాజారావు, మాజీ వార్డు సభ్యులు నల్లగారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అన్ని సమస్యలు పరిష్కరిస్తాం : బీటెక్ రవి

వేముల, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని సమస్యలు త్వరలోనే పరిష్కారం చేస్తామని టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. సోమవారం మధ్యాహ్నం వేములలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పక్కాగృహాలు కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

కడపనాగరాజుపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడపలోని రాజారెడ్డి వీధిలో మూలనక్షత్రం పురస్కరించుకొని జ్ఞానసరస్వతీ దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు సోమవారం నిర్వహించారు. పుష్పగిరి తీర్థక్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సట్టి భారవి, సభ్యులు మాడుగుల శివ శ్రీశర్మ, సత్యనారాయణ గాంధీ, జగన్మాత మారెమ్మ దేవస్థాన నిర్వాహకులు సట్టి భాస్కర్, వారాహి ఉపాసకుడు వరప్రసాద్, బద్వేల్ మల్లికార్జున, మాస్టర్ మనీష్ తదితరులు అక్షరాభ్యాసాలు, శాంతిహోమం నిర్వహించారు. అలాగే దక్షిణ కాశీ పుష్పగిరి గిరిప్రదక్షిణ ప్రచారంలో భాగంగా పోస్టర్ విడుదల చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సంతకాల ఉద్యమం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సంతకాల సేకరణ ఉద్యమాన్ని కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టిందని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పులివెందులలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశానికి పార్లమెంటరీప్రజాస్వామ్య వ్యవస్థ అనుకూలంగా ఉంటుందని మన రాజ్యాంగ నిర్మాతలు మనకు పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఇచ్చారన్నారు. కార్యక్రమంలో పులివెందుల పట్టణ అధ్యక్షుడు ఖాదర్‌వల్లి,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్దే స్మార్ట్ కార్డుల పంపిణీ

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే కార్డుదారులకు కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులను ప్రభుత్వం అందజేయడం జరిగిందని వీటిని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి అన్నారు. మండలలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామంలో సోమవారం మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మీదేవి, అధ్యక్షతన స్మార్ట్ రేషన్‌కార్డులను ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రసాదరెడ్డి, మండల టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచు ఓబులేసు, గోనుమాకులపల్లె సొసైటీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, సంగమేశ్వరాలయం చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి..: స్మార్ట్ రేషన్ కార్డులతో పారదర్శకత, జవాబుదారీతనం, సరుకుల పంపిణీని మెరుగు పరుస్తాయని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి తెలిపారు.చీమలపెంట గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు స్మార్ట్‌రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా రేషన్ సరుకులు పొందడానికి వీలు కల్పిస్తుందన్నారు. వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ పొందే విధంగా సచివాలయ సిబ్బందిని కేటాయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జగన్ మోహన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు,ఆర్ఐ శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి,సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి,క్లస్టర్ ఇన్‌చార్జ్ కిషోర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు సురేంద్రారెడ్డి ,మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వీఎన్ పల్లె... స్మార్ట్‌కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి

వల్లూరు..: మండల కేంద్రమైన వల్లూరులో స్మార్ట్‌కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దారు శ్రీవాణి, టీడీపీ మండల ఇన్‌ఛార్జ్, సింగిల్‌విండో అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈకార్డు కేవలం రేషన్ తీసుకునేదానికే కాక బస్సుల్లో ఉచిత ప్రయాణానికి ఉపయోగపడుందన్నారు. ఈ కార్డుల పంపిణీలో ఆర్ఐ సందీప్, డీలరు రామతులసి, వీఆర్వోతో పాటు మహిళలు పాల్గొన్నారు.

సీకేదిన్నె..: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కార్పోరేషన్‌లో విలీనమైన 17వ డివిజన్‌లో సోమవారం కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాబానగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు రోనాల్డ్, నాయకులు కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, శివశంకర్, నరసింహులుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు విభజన ముసాయిదా సిద్ధం


ఎర్రగుంట్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ వార్డులను పెంచుతూ పురపరిపాలనా శాఖ కమిషనర్ విడుదల చేసిన జీవోను కమిషనర్ శేషఫణి ఆధ్వర్యంలోని అధికారులు విడుదల చేశారు. పురపాలక సంఘంలో 27వార్డులను ఎలక్షన్ వార్డులుగా ముసాయిదాను తయారు చేశారు. ఇందుకు సంబంధించిన ప్రతులను ఎర్రగుంట్ల మున్సిపాలిటి, ఆర్డీవో కార్యాలయం, అన్ని సచివాలయాల కార్యాలయాల్లోను నోటీసు బోర్డులలో ఉంచినట్లు కమిషనర్ తెలిపారు. ప్రజలు తమ సూచనలు, సలహాలను అక్టోబరు 6వతేదీ లోపు సమర్పించవలసిందిగా కోరారు.











రితేష్‌ని కలిసిన బద్వేల్ మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్


రితేష్‌రెడ్డి,విజయమ్మలను మర్యాదపూర్వకంగా కలిసిన వైస్ చైర్మన్ రవీంద్రారెడ్డి టీడీపీ నాయకులు

కాశినాయన సెప్టెంబరు29 (ఆంధ్ర జ్యోతి) బద్వేల్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి సోమవారం బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి కె.రితేష్‌రెడ్డి, టీడీపీ మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మలను మర్యాద పూర్వకం గా కలిశారు. ఈసందర్భంగా తనపై నమ్మకంతో వైస్ ఛైర్మన్ పదవి ఇప్పించిన ఇరువురు నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు అనంతరం పూలమాల శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు డి.క్రిష్టారెడ్డి, పోరుమామిళ్ల టీడీపీ అధ్యక్షుడు భైరవప్రసాద్, కె. .రామసుబ్బారెడ్డి, బాదుల్లా, వెంకట్రామిరెడ్డి, .పోలిరెడ్డి, కె.నరసింహారెడ్డి, క్రిష్ణయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ప్రొద్దుటూరు రూరల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళలతోపాటు గర్భవతులు, బాలింతలు, కౌమార బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని కామనూరు పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ పేర్కొన్నారు. సోమవారం దొరసానిపల్లెలో స్వశక్తి నారీ స్వశక్తి పరివార్ అబియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచి ఆహార నియమాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, సూపర్‌వైజరు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

కొండాపురం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మూడు రైతుసేవాకేంద్రాలలో సోమవారం యూరియా పంపిణీ చేసినట్లు ఏవో ఏవీరామాంజులరెడ్డి తెలిపారు. బెడుదూరు, తాళ్లప్రొద్దుటూరు, రేగడిపల్లె రైతు సేవా కేంద్రాలలో ఒక్కో కేంద్రంలో 9.9 మెట్రిక్ టన్నులు యూరియా, డీఏపీ 10 మెట్రిక్‌టన్నులు చొప్పున, మొత్తం 29.7 మెట్రిక్ టన్నులు యూరియా, 30 మెట్రిక్ టన్నులు డీఏపీ పంపిణీ చేసినట్లు ఏవో తెలిపారు.

ముద్దనూరులో: రైతులు పంటకు అవసరమైన మేరకు యూరియా వాడుకోవాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండల పరిధి శెట్టివారిపల్లె రైతు సేవా కేంద్రంలో సోమవారం యూరియా పంపిణీ చేపట్టారు.ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రంలో రైతుకు రెండు బస్తాల యూరియా అందిస్తున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది శిరీష, సందీప్, ప్రకృతి వ్యవసాయం రామసుధ పాల్గొన్నారు.

లోక్ కళ్యాణ్ మేళాను వినియోగించుకోండి

మైదుకూరు సెప్టెంబరు29 (ఆంధ్ర జ్యోతి):పట్టణ పేదరిక నిర్మూల సంస్థ మెప్మా ఆధ్వర్యంలో వీది వ్యాపారులు బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు లోక్ కళ్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోవాల ని అధికారులు సూచించారు. ఈ లోక్ కళ్యాణ్ మేళాలో వీది వ్యాపారులకు పీఎం స్వనిది యోజన కిం ద రూ.15వేలు, రూ.25వేలు, రూ.50 వేలు అందించి ఆర్థిక స్వావలంబన కలిగిస్తారన్నారు. ఆమేరకు సోమవారం మైదు కూరులో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లను అధికారులు చేయించారు. యూనియన్ బ్యాంకు ద్వారా అత్యధికంగా 1800 మందికి రుణాలు అందించారన్నారు. మెప్మా టీఈ కెజియా జాస్లీన్, సిబ్బంది, ఆర్‌పీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించాలి

ఖాజీపేట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు తప్పని సరిగా టీకాలు వేయించడం వలనప్రాణాంతకర వ్యాధులు నుంచి కాపాడవచ్చని డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేష్ అన్నారు. సోమవారం ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బి.కొత్తపల్లె పంచాయతీలో మెగా స్వస్తనారీ, స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని సర్పంచ్ రాణెమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

చదువులతల్లీ.. నమోస్తుతే..!


ప్రొద్దుటూరు చెన్నకేశవస్వామి, వేంకటేశ్వరస్వామి, శివాలయం, ముక్తిరామలింగేశ్వర ఆలయంలో సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

మైదుకూరులో సరస్వతీదేవిగా అమ్మవారు

జమ్మలమడుగుసరస్వతీదేవిగా వాసవీమాత

ఎర్రగుంట్లలో సరస్వతీదేవిగా అమ్మవారు

ఖాజీపేటలో సరస్వతీదేవిగా అమ్మవారు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చదువులతల్లీ..నమోస్తుతే..! అంటూ దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిశాల, చెన్నకేశవస్వామి ఆలయం, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, రాజరాజేశ్వరీదేవి ఆలయం, రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం, చౌడేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

జమ్మలమడుగులో: జమ్మలమడుగులో సోమవారం 8వ రోజు దసరా శరన్నవరాత్రులలో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మూలానక్షత్రం పురస్కరించుకుని బిందెసేవ వైభవంగా నిర్వహించారు. రాత్రి అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. కన్యతీర్థంలోని బాలత్రిపుర సుందరీదేవి సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

దువ్వూరులో: దువ్వూరులో సోమవారం ఆర్యవైశ్యులు బిందెసేవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పురవీధుల్లో తిరుగుతూ ఈ కార్యక్రమం కొనసాగించారు. సాయంత్రం అమ్మవారికి సరస్వతీదేవి అలంకారం గావించారు.

బద్వేలుటౌన్‌లో : పట్టణంలోని ఆర్యవైశ్యయువకులు నిర్వహించిన బిందెసేవా వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వివిధ రకాల వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి. అమ్మవారిశాలలో అమ్మవారు సరస్వతీదేవిగా, కోదండరాస్వామి ఆలయంలో అనంతపద్మనాభ స్వామిగా మహాలక్ష్మిదేవి ఆలయంలో ఐశ్వర్య లక్ష్మీదేవిగా, కనకదుర్గాదేవి ఆలయంలో సరస్వతీ దేవీల అలంకారాలతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

మైదుకూరు రూరల్‌లో: మైదుకూరు అమ్మవారిశాలలో సోమవారం సరస్వతిదేవి అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఆర్యవైశ్య యువకులు బిందె సేవలో పాల్గొన్నారు. పట్టణంలోని అమ్మవారుశాలలో సరస్వతి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని సోమవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దర్శించుకొన్నారు. ఆర్యవైశ్య సభ నూతన అధ్యక్షుడు బల్లాని చెన్నకేశవప్రసాద్ వారి బృందంతో ఉత్సవాలు బాగా చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఖాజీపేటలో: మత్కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో దసరా పండుగను పురష్కరించుకుని సోమవారం సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు, విద్యార్థులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి మైదుకూరు శాసనసభ్యుడు పుట్టా సుధాకర్‌యాదవ్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.

కొండాపురంలో: మండలంలోని దత్తాపురం పెద్దమ్మగుడిలో సోమవారం సరస్వతీదేవిగా అమ్మవారు దర్శన మిచ్చారు. చిత్రావతి నది తీరాన వెలసిన సరస్వతీ దేవి ఆలయంలో మూల నక్షత్రం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు పిల్లలచేత అక్షరాభ్యాసం చేయించారు.

పోరుమామిళ్లలో: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పోరుమామిళ్లలోని వాసవీ కన్యకా పరమేశ్వరిదే వి ఆలయంలో సోమవారం రాత్రి సరస్వతీదేవి అలంకారం చేశారు. ఈ సం దర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు.

కాశినాయనలో: దసరా ఉత్సవాలల్లో భాగంగా 8వ రోజు సోమవారం మండలంలోని నర్సాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో అమ్మవారు శారదాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

బ్రహ్మంగారిమఠంలో: మండల కేంద్రంలోని వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో దసరా దేవీ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు.

ఎర్రగుంట్లలో: దసరా ఉత్సవాల్లో భాగంగా సరస్వతీదేవి అలంకా రంలో అమ్మవారు భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. ఏరువాకగంగమ్మ, చౌడేశ్వరీదేవి,పార్వతీదేవి, దుర్గాదేవిలు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.


బిందెసేవ నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు


దువ్వూరులో బిందెసేవ

వీరభద్రస్వామి ఆలయ చైర్మన్‌గా వీరనారాయణ


ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్మన్ వీరనారాయణ, కమిటీ సభ్యులు

చాపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం నూతన కమిటీ చైర్మన్‌గా పెరుగు వీరనారాయణయాదవ్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జునప్రసాద్ చైర్మన్‌తోపాటు 11 మంది సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేవాలయానికి వచ్చే భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు మరిన్ని గదులు నిర్మిస్తానని చెప్పారు. చైర్మన్ వీరనారాయణను ఎమ్మెల్యే, మల్లికార్జునప్రసాద్, కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ గురివిరెడ్డి, ఏపీఎస్ఐడీసీ డైరెక్టర్ అన్నవరం సుధాకర్‌రెడ్డి, అల్లాడుపల్లె రైతు సేవా సహకార సొసైటీ ఛైర్మన్ నరసింహారెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి, మైదుకూరు మార్కెట్‌యార్డు ఛైర్మన్ కేపీ రవీంద్ర, వైస్‌చైర్మన్ నాయబ్‌రసూల్, పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.టీడీపీ నాయకులు గోసుల క్రిష్టారెడ్డి, నారపురెడ్డి, బాబు, వీరశేఖర్‌రెడ్డి, వేమారెడ్డి, ప్రతాపరెడ్డి, వీరనారాయణ, వెంకటేశ్వరరెడ్డి, అబ్దుల్‌సలీం, తదితరులు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

జీఎస్టీ తగ్గింపు ప్రజలకు ప్రయోజనకరం

గోపవరం, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి):జీఎస్టీ తగ్గింపుతో ధరలు తగ్గి ప్రజలకు ప్రయోజనం చేకూరుతోందని ఎంపీడీవో రామనాథరెడ్డి తెలిపారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై అలాగే మత్తు పదార్థాల నిర్వహణపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ, పోలీసు సిబ్బంది, ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.





మహిళ ఆరోగ్యమే కుటుంబానికి రక్ష


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న స్టేట్ డైరెక్టర్ రంతు

కలసపాడు, సెప్టెంబరు 29 (ఆంధ్ర జ్యోతి): ప్రతి మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందని ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సాధనకారి రంతు, ఎంపీపీ నిర్మలాదేవిలు పేర్కొన్నారు. సోమవారం కలసపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని అక్కడ ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించి రోగులకు పండ్లు అందజేశారు. శిబిరంలో 278 మంది ప్రజలు హాజరై వారి పేర్లు నమోదు చేసుకున్నారు. షుగర్, బీపీ, క్షయ, కంటి పరీక్షలు, గర్భవతులు, బాలింతలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శైలజ, డాక్టర్ సాయితేజ, స్థానిక సర్పంచు శివలీల, మలేరియా అధికారి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలి

దువ్వూరు, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు ప్రాథమిక వ్యవసాయ సంఘంలో బకాయిల వసూళ్లపై దృష్టిసారించాలని సర్వసభ్య సమావేశంలో తీర్మాణించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో సొసైటీ అధ్యక్షుడు పోలు రామమోహన్‌రెడ్డి అధ్యక్షతన తోటి సభ్యులతో సమావేశం నిర్వహించారు. 1439 మంది సభ్యులున్న సంఘంలో రూ.23 కోట్లు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారని, వడ్డీలు చెల్లించి సభ్యులు రెన్యువల్ చేసుకోవాలని తీర్మాణించారు.

అక్రమ కేసులు ఉపసంహరించాలి

బద్వేలు, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): ఆయా నగర పాలక సంస్థలలో కార్మికులపై అక్రమ కేసులు ఏపసంహరించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. ఆ మేరకు పట్టణ కమిటీ సమక్షంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రబాబు మాట్లాడుతూ నగరపాలక సంస్థలో వాటర్ సెక్షన్‌లోని పిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌరిశంకర్‌పై నిందలు మోపి తొలగించేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు.

